క్లుప్తంగా

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని లోడ్‌పల్లి గ్రామానికి చెందిన మీసాల నిమ్మక్క అనే గర్భిణీకి శనివారం పురిటి నొప్పులు రాగా వెంటనే 108 అంబులెన్సులో కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈక్రమంలో మార్గం మధ్యలో చేడ్వాయి అటవీ ప్రాంతంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే 108 సిబ్బంది పురుడు పోయగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, కాగజ్‌నగర్ ఆసుపత్రిలో చేర్పించినట్లు ఈఎంటీ బుర్రి సుధాకర్, పైలట్ శ్రావణ్‌లు పేర్కొన్నారు.

'సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టండి'

ఆసిఫాబాద్‌అర్బన్: హెల్ప్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అహ్మద్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ కార్యాలయానికి రమాబాయి కమ్యూనిటీ అభివృద్ధి సొసైటీ కమిటీ సభ్యులు రాగా పలు సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. రమాబాయి మహిళా కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తామన్నారు. రమాబాయి మహిళా కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు లలితను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ లీగల్ అడ్వైజర్ కిషోర్, సభ్యులు కమల, తాండ్ర వరలక్ష్మి, షీలా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్: మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ శనివారం తెలిపారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు ఎక్కువగా ఉన్నందున మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామన్నారు. పత్తి విక్రయానికి వచ్చే రైతులు 10వ తేదీన పత్తి తీసుకురావాలని సూచించారు.

ఉచితంగా దీక్ష దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పవన్‌కుమార్

జైనూర్: మండల కేంద్రంలో జంగో లింగో దీక్షాదారులకు అనక దేవేందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీక్షా దుస్తులను సభ్యుడు జన్నావార్ పవన్‌కుమార్ ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసేందుకు ఫౌండేషన్ ఏర్పడిందన్నారు. మడావి హోమేశ్‌కుమార్, దత్తు, దీక్షాదారులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని మోవాడ్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్స్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఫిరోజ్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీసబ్‌స్టేషన్ అదనపు నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

14 నుంచి చదరంగం పోటీలు

తాండూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14నుంచి కుమార్ బ్రదర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు కోచ్ సమ్మయ్య తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో ఐదు రౌండ్లలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు 9490141675 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల బర్లగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులకు శనివారం ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి భూమిపూజ చేశారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని శ్రీదేవి సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాతు వెంకటేష్, వార్డు సభ్యురాలు మమత, కో–ఆప్షన్ సభ్యుడు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో ప్రభుత్వ కళాశాల

- ప్రహరీ లేక పశువుల సంచారం
- ప్రయోగశాల, అదనపు తరగతి గదుల కొరత
- గతేడాది వంద శాతం ఉత్తీర్ణత



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

వాంకిడి: అనుభవజ్ఞులైన ఉత్తమ బోధకులు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. గతేడాది పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. కానీ కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి భవన నిర్మాణంతో పాటు ఏకైక మరుగుదొడ్డి నిర్మాణానికి మినహా అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అనేక తిప్పలు పడుతున్నారు.

అనేక సమస్యలు..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ప్రతీ విద్యా సంవత్సరంలో 300మందికి పైగా విద్యార్థులు కళాశాలలో చదువుకుంటున్నారు. కళాశాలలోని ఏకైక చేతిపంపు పాడైపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. దశాబ్దాల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. వాటినే కళాశాల సిబ్బంది, విద్యార్థులు వినియోగిస్తున్నారు. గతేడాది అప్పటి ఎమ్మెల్యే ఆత్రం సక్కు మరుగుదొడ్ల కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపినా నిధులు రాలేదని సిబ్బంది వాపోతున్నారు. గతేడాది ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుంచి కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా ఆ పథకం ఏడాదికే పరిమితమైంది. ప్రస్తుతం ఇంగ్లిష్ మీడియంలో 40 మంది విద్యార్థులు ఉండగా వారికి సంబంధించిన పుస్తకాలు ఇంత వరకు రాలేదు. దీంతో తెలుగు మీడియం పుస్తకాలతోనే నెట్టుకొస్తున్నారు. కళాశాలలో ఆటలు ఆడుకునేందుకు, మొక్కలు పెంచుకునేందుకు సరిపడా స్థలం ఉన్నప్పటికీ ప్రహరీ లేని కారణంగా ఆవరణలో పశువుల సంచారం ఎక్కువగా ఉంటుంది. దీంతో మొక్కలకు సంరక్షణ లేకుండా పోతోంది. కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు కూడా లేవు. రెండు గ్రూపుల విద్యార్థులకు కలిపి ఒకే గదిలో పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఉంది. సైన్స్ విద్యార్థులకు సంబంధించిన వృక్ష శాస్త్రం, జీవ శాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల ప్రయోగాలు చేసేందుకు ప్రత్యేక గదులు లేకపోవడంతో ఉన్న గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కళాశాలలో విద్యా పరికరాలు, తదితర అవసరాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్రమశిక్షణలో భేష్..

అధ్యాపక సిబ్బంది ఇచ్చే సలహాలు సూచనలతో విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతున్నారు. విద్యతో పాటు కళాశాల ఆవరణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం, మొక్కలు పెంచడం, వాటిని రక్షించడంలో ఎంతో కృషి చేస్తున్నారు. వందల సంఖ్యలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి గార్డెన్‌ను తలపిస్తున్నాయి. ప్రస్తుతం కళాశాలలో ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ ప్రత్యేక కృషితో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ మీడియం తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరానికి ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి మొత్తం 387 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. కళాశాలలో కనీస అవసరాలకు సంబంధించిన సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సిబ్బంది పేర్కొంటున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



దశాబ్దాల కాలంలో నిర్మించిన మరుగుదొడ్లే ఇప్పటికీ వినియోగిస్తున్నాం. బాయ్స్, గర్ల్స్‌తో పాటు సిబ్బంది కూడా కలిపి ఒకే మరుగుదొడ్డి ఉంది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– లోబడె శ్రీలేఖ, ఎంపీసీ సెకండ్ ఇయర్

ప్రయోగశాలకు గదులు నిర్మించాలి



ప్రయోగశాలలకు ప్రత్యేక గదులు లేవు. ఒకే గదిలో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రయోగాలు చేస్తున్నాం. బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు వేర్వేరుగా ప్రయోగశాలలు నిర్మించాలి. అన్ని గ్రూపులకు సరిపడా తరగతి గదులు కూడా నిర్మించాలి.

– పూజ, బైపీసీ సెకండ్ ఇయర్

వసతులు కల్పించాలి..



విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలుగుతున్నారు. వారికి అన్ని రకాలుగా వసతులు కల్పిస్తే మరింత చురుకుగా పరీక్షల్లో ఫలితాలు రాబట్టవచ్చు. గతేడాది 100శాతం ఉత్తీర్ణత సాధించాం. ప్రహరీ, అదనపు తరగతి గదులు, ప్రయోగ శాలలకు ప్రత్యేక గదులు, క్రీడా సామగ్రి, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– సంపత్ కుమార్, ప్రిన్సిపాల్

రాములోరి అక్షింతల పంపిణీ



ఎల్కపల్లిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ



బెజ్జూర్: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో అయోధ్య రాములోరి పూజిత అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గడపగడపకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సముద్రాల సరిత, సర్పంచ్‌లు కావ్య, రాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో శనివారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి మండల కేంద్రంలోని రంగనాయక ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయ అర్చకుడు గురు దత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

కౌటాల: అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో శనివారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. నిర్వాహకులు చాపిలే జ్ఞానేశ్వర్, సంతోష్, సాయినాథ్, గంగాధర్, మధుకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ, గూడెం గ్రామాలలో శనివారం ఇంటింటికి రాముల వారి అక్షింతలు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళ హారతులు, వాయిద్యాలతో రాముడి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యా బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం తన నివాసంలో పీఆర్టీయూ సంఘం నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో విద్యను మరింత బలోపేతం చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, ప్రకాశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, సత్యనారాయణ, ఉదయ్‌బాబు, గోవింద్ రావు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్, మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్‌లు ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సదానందం, ఇన్‌చార్జి హెచ్‌ఎం చైతన్య, ఉపాధ్యాయులు ఈశ్వర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను శనివారం సంఘం మండల అధ్యక్షుడు జాధవ్ రామారావ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ఎప్పుడూ కృషి చేస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి రాథోడ్ వసంత్‌రావు, శ్రీకాంత్, ఉత్తం, విలాస్, జైపాల్ పాల్గొన్నారు.

గురుకృప దినోత్సవానికి పూర్తి సహకారం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి వద్ద ఈ నెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవానికి పూర్తి సహకారం అందిస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, కమిటీ సభ్యులు పోస్టర్ ఆవిష్కరించారు. జాతీయ బంజారా దీక్షభూమి అభివృద్ధిపై చర్చించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, కమిటీ సభ్యులు రాథోడ్ రమేశ్, దేవిదాస్, నరహరి పాల్గొన్నారు.

దీక్ష భూమికి ప్రత్యేక బస్సులు..

కొత్తపల్లి– హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్షభూమి వద్ద ఈనెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవ సందర్భంగా ఈనెల 13 వరకు ప్రత్యేక బస్సులు నడపాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. శనివారం దీక్షభూమికి చేరుకున్న ఆర్టీసీ బస్సుకు దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఉట్నూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నర్సరీ పనులు ప్రారంభం



నర్సరీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ పవన్

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామ పంచాయతీ కేంద్రంలో హరితహారం నర్సరీని గ్రామ సర్పంచ్ పెందుర్ పవన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్, వన సేవకునికి పలు సూచనలు చేశారు. విత్తనాలు నాటడం నుంచి మొక్కల మార్పిడి వరకు నర్సరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్, వనసేవక్ ఆనంద్‌రావు, గ్రామస్తులు సుధాకర్, అశోక్, పుష్పలత, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: నర్సరీలో పనులను వేగవంతం చేయలని ఎంపీడీవో మహేందర్ తెలిపారు. శనివారం మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ కవర్లలో నింపాలన్నారు. నింపిన కవర్లకు ప్రతీరోజు ఉదయం, సాయంకాలం నీళ్లు పోయాలని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఇదేం కల్వర్టు!



కెరమెరి: మండలంలోని కెలికె, లేండిగూడ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు ఏడేళ్ల క్రితం ధ్వంసమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా అధ్వానంగా మారింది. కనీసం నడిచేందుకు కూడా యోగ్యంగా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల 'ఆన్‌లైన్' ప్రారంభం



దహెగాం: ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపీడీవో



రెబ్బెన: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కెరమెరి: ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో



సిర్పూర్(టి)లో..



కౌటాల: దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శనివారం ముగిశాయి. గ్రామసభలలో ఆయా పథకాల కోసం ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 7,988 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 8,881 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1,128 మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు.

కెరమెరిలో..

కెరమెరి: ప్రజాపాలనలో భాగంగా మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 10600 కుటుంబాలు ఉండగా, 10015 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను ప్రత్యేక పోర్టల్‌లో ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో మహేందర్ ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈనెల 12లోపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, శనివారం అర్ధరాత్రి వరకు 963 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు.

ఆందోళన వద్దు..

దరఖాస్తులు చేయలేదన్న ఆందోళన వద్దని మరో నాలుగు నెలల తర్వాత ప్రజాపాలన తిరిగి ప్రారంభమవుతుందని ఎంపీడీవో మహేందర్ అన్నారు. శనివారం మండలంలోని తుమ్మగూడ, సాకడ, సాంగ్వి గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొని ఆయన మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలో శుక్రవారం వరకు జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను శనివారం మండలంలోని అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేశారు.

కౌటాల: ఆరు గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 11వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు.

రెబ్బెన: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో అంజద్‌పాషా పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ముగిసినట్లు పెంచికల్‌పేట్ ఎంపీడీవో గంగాసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 గ్రామపంచాయతీల్లో 4955 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

లింగాపూర్: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులు చేసుకున్న ప్రభుత్వ పథకాల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ మండలంలో ప్రారంభించారు. దరఖాస్తుల ప్రక్రియ శనివారం ముగియడంతో అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్నూర్: మండల కేంద్రంలోని ఎస్ఆర్ఎస్ఆర్ ఫార్మర్ సొసైటీ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి రాజేశ్వర్, సీపీవో నరేశ్, ధాన్ ఫౌండేషన్ టీం లీడర్ రాథోడ్ నిలేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. లైసెన్స్ కలిగి దుకాణాల్లో మాత్రమే పత్తి అమ్మాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు దళారుల బెడద నుంచి తప్పించడానికే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కొట్నాక్ మాధవ్, చైర్మన్ మాడవి నాగోరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899